ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.6, కనిష్ఠం 19.8



5

కామారెడ్డి జిల్లా వార్తలు

ఆదివారం 21 జనవరి 2024

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

మాచారెడ్డి, జనవరి 20: పల్వంచ మండలంలోని భవానీపేట ఉన్నత పాఠశాలలో సర్పంచ్ మద్దెల రాజు, గ్రామ నాయకులు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సూర్యప్రకాష్ గౌడ్, ఎస్ఎంసీ చైర్మన్ నర్సింలు, ఉప సర్పంచ్ రమేష్‌గౌడ్, వార్డుమెంబర్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు అరుణ, లింగారెడ్డి, శ్రీశైలం, లక్ష్మీరాజం, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ ఎంపీ టికెట్ కోసం

పోటాపోటీ!



- జహీరాబాద్ నుంచి టికెట్ ఆశిస్తున్న వారి సంఖ్య ఎక్కువే
- టికెట్ కోసం పది మందికి పైగానే నేతల మధ్యపోటీ
- టికెట్ కోసం ఆశావహుల ప్రయత్నాలు
- అభ్యర్థుల ఎంపికే అసలు సమస్య
- జహీరాబాద్ పార్లమెంట్ స్థానంపై ఫోకస్ పెట్టిన పార్టీ అధిష్ఠానం
- ఇప్పటికే ఎంపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నియామకం
- అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమీక్షిస్తున్న ఇన్‌చార్జి

కామారెడ్డి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల సమయం దగ్గర పడుతున్న కొద్దీ జహీరాబాద్ లోక్‌సభ టికెట్ కోసం బీజేపీలో తీవ్ర పోటీ నెలకొంటుంది. ఈ స్థానం నుంచి పార్టీ పరంగా పోటీ చేసేందుకు రోజురోజుకూ ఆశావహుల సంఖ్య పెరుగుతునే ఉంది. జహీరాబాద్ ఎంపీగా పోటీ చేసేందుకు ఆ పార్టీలో పది మందికి పైగానే నేతలు టికెట్‌ను ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఎంపీ స్థానంపై పార్టీ అధిష్ఠానం సైతం ప్రత్యేక దృష్టి సారించింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో లోక్‌సభ పరిధిలో బీజేపీ ఓటు బ్యాంక్ పెరగడం ఓ అసెంబ్లీ స్థానాన్ని సైతం కైవసం చేసుకోవడంతో ఎంపీ సీటును సైతం గెలుచుకునేందుకు వ్యూహరచన పన్నుతోంది. ఇందులో భాగంగానే జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డిని పార్టీ అధిష్ఠానం ఇన్‌చార్జీగా నియమించింది. ఇప్పటికే ఎమ్మెల్యే అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా బీజేపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తూ గెలుపుపై దిశా నిర్దేశం చేస్తూ ఉన్నారు. అయితే ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో గెలిచే వ్యక్తికే టికెట్ ఇవ్వడంపై పార్టీ అధిష్ఠానానికి అసలు సమస్యగా ఏర్పడనుంది.

జహీరాబాద్‌పై అధిష్ఠానం ఫోకస్

లోక్‌సభ ఎన్నికలపై బీజేపీ అధిష్ఠానం ఫోకస్ పెట్టింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని కామారెడ్డి మినహాయిస్తే మిగితా 6 నియోజకవర్గాల్లోనూ ఘోర పరాభావం చవి చూసింది. అయితే గతంతో పోలిస్తే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ, జహీరాబాద్, నారాయణఖేడ్ నియోజకవర్గాల్లో బీజేపీ ఓటు బ్యాంక్ కాస్త పెరిగింది. ఈ నేపథ్యంలో జహీరాబాద్ పార్లమెంట్‌పై బీజేపీ దృష్టి సారించింది. రెండు మూడు నెలల్లో జరగనున్న ఎంపీ ఎన్నికల్లో సత్తా చాటాలని భావిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని భావిస్తోంది. ఇందుకోసం ఇప్పటి నుంచే కార్యాచరణను ప్రారంభించింది. జహీరాబాద్ లోక్‌సభ ఇన్‌చార్జీలుగా కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డిని నియమించింది. లోక్‌సభ ఎన్నికలపై ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి జిల్లా అధ్యక్షురాలు అరుణతార ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జీలతో ఇప్పటికే పలుమార్లు సమావేశాలు నిర్వహించి సమీక్ష నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎలాగైనా సత్తా చాటేందుకు కార్యాచరణను ప్రారంభించారు.

గత తప్పిదాలు పునరావృతం కాకుండా చర్యలు

జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో జహీరాబాద్, ఆందోల్, నారాయణఖేడ్, కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. అయితే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు నియోజకవర్గాల్లో కమలం పార్టీ ఘోర పరాజయం పాలైన విషయం తెలిసిందే. జహీరాబాద్, ఆందోల్, నారా యణఖేడ్ నియోజకవర్గాల్లో బీజేపీ అభ్యర్థులకు డిపాజిట్‌లు కూడా దక్కలేదు. ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గంలో బీజేపీకి కాస్త ఓట్లు మెరుగుపడ్డాయి. కామారెడ్డిలో బీజేపీ విజయం సాధిం చింది. కనీసం లోక్‌సభ ఎన్నికల్లోనైనా జహీరాబాద్ పార్లమెంట్ స్థానా నికి గెలిచే అభ్యర్థిని ఎంపిక చేయాలని పార్టీ శ్రేణుల నుంచి వినిపిస్తోంది. అయితే పార్లమెంట్ టికెట్ కోసం బీజేపీలో తీవ్ర పోటీ నెలకొంది.

ఎంపీ టికెట్ ఆశిస్తున్న వారి సంఖ్య ఎక్కువే..

జహీరాబాద్ ఎంపీ టికెట్ కోసం బీజేపీలో ఆశిస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ప్రస్తుతం పది మంది ముఖ్య నేతలు జహీరాబాద్ ఎంపీ టికెట్‌ను ఆశిస్తున్నారు. ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఇటీవల పోటీ చేసి ఓటమి పాలైన వడ్డెపల్లి సుభాష్‌రెడ్డి ఎంపీ కోసం పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన బీజేపీలో చేరేటప్పుడు ఎల్లారెడ్డి అసెంబ్లీతో పాటు ఎంపీ టికెట్ ఇస్తామని పార్టీ హామీ ఇచ్చినట్లు ఆయన అనుచరులు చెబుతున్నారు. అదేవిధంగా తాడ్వాయి మండలానికి చెందిన ప్రముఖ సైంటిస్ట్ సామాజిక సేవచేసే పైడి ఎల్లారెడ్డి సైతం జహీరాబాద్ ఎంపీ టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే ఆయన పార్లమెంట్ పరిధిలో పార్టీ కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలను ముమ్మరం చేశారు. ఆర్ఎస్ఎస్ నేతలతో సన్నిహిత సంబంధాలు ఉండగా రాష్ట్ర, జాతీయ స్థాయి నాయకులను కలుస్తూ వస్తున్నారు. మాజీ జిల్లా అధ్యక్షుడు గతంలో జహీరాబాద్ ఎంపీగా పోటీ చేసి ఓడిపోయిన బాణాల లక్ష్మారెడ్డి సైతం టికెట్ ఆశిస్తున్నారు. దశాబ్దాలుగా ఆయన పార్టీలో కొనసాగుతున్నారు. ఈసారి టికెట్ తనకే వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో బోధన్ టికెట్ ఆశించి భంగపడ్డ మేడపాటి ప్రకాష్‌రెడ్డి సైతం టికెట్‌ను ఆశిస్తున్నాడు. టికెట్ కోసం ప్రకాష్‌రెడ్డి జాతీయనేతలను కలుస్తూ వస్తున్నాడు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని డీసీసీబీ మాజీ చైర్మన్ జైపాల్‌రెడ్డి, మాజీ ఎంపీ ఆలె నరేందర్‌రెడ్డి తనయుడు భాస్కర్‌తో పాటు పైల కృష్ణారెడ్డి, రచనారెడ్డి, రాంసింగ్, సోమాయప్ప స్వామిజీలు సైతం జహీరాబాద్ ఎంపీ టికెట్ కోసం పోటీ పడుతూ ఎవరికివారే ప్రయత్నాలు చేస్తున్నారు. జహీరాబాద్ పార్లమెంట్ స్థానానికి పార్టీ పరంగా టికెట్ ఆశిస్తున్న వారి సంఖ్య ఎక్కువగా ఉండడంతో అభ్యర్థిని ఎంపిక చేయడంలో ఆ పార్టీ నాయకత్వానికి సమస్యాత్మకంగా మారనుందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.



మాట్లాడుతున్న భారతీయ కిసాన్ సంఘ్ క్షేత్ర సంఘటన మంత్రి రాము

వ్యవసాయం సంక్షోభంలో లేదు..

రైతులు మాత్రమే సంక్షోభంలో ఉన్నారు

- భారతీయ కిసాన్‌సంఘ్ క్షేత్ర సంఘటన మంత్రి రాము

కామారెడ్డి టౌన్, జనవరి 20: దేశంలో, రాష్ట్రంలో వ్యవసాయం సంక్షోభంలో లేదని రైతులు మాత్రమే సంక్షోభంలో ఉన్నారని భారతీయ కిసాన్‌సంఘ్ క్షేత్ర సంఘటన మంత్రి రాము, జాతీయ కార్యవర్గ సభ్యుడు శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం లింగాపూర్ వద్ద గల బృందావన్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ దేశంలో వ్యాపారులు బాగానే ఉన్నారని రైతు మాత్రమే ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నాడని ప్రభుత్వం నిర్ణయించే ధరకు కొనుగోలు చేసే నాథులే లేరని అన్నారు. ధరల పెరుగుదలపై చేసే ఉద్యమాలు ఆహార ధాన్యాల పెరుగుదలపై చేయాలని, నూటికి 60 శాతం మందికి ఉపాధి కల్పించే రంగం వ్యవసాయరంగమని అన్నారు. రైతాంగ సమస్యలపైనే కిసాన్ సంఘ్ నిరంతర పోరాటం చేస్తుందని తెలిపారు. జిల్లాలో భారతీయ కిసాన్‌సంఘ్‌లో లక్ష మంది రైతుల సభ్యత్వం చేయడమే ప్రధాన ఉద్దేశ్యమని దేశవ్యాప్తంగా లక్ష గ్రామాల్లో కోటికిపైగా సభ్యతాలు చేయబోతున్నామని తెలిపారు. అన్ని గ్రామాల్లో కమిటీలు వేయాలని, భారతీయ కిసాన్‌సంఘ్‌లేని మండలం ఉండదని సభ్యులకు సూచించారు. ప్రతీ 3 సంవత్సరాలకు ఒకసారి సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉండాలని 2024 మార్చి 31తో పాత కమిటీల కాలం ముగుస్తుందని తెలిపారు. ఫిబ్రవరి 1 నుంచి 20 వరకు అన్ని గ్రామాల్లో సభ్యత్వ అభియాన్ కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. కిసాన్‌సంఘ్‌లో ప్రతీ రైతు నాయకుడేనని ఏకరూప నిర్ణయాలు ఉండవని కేవలం సామూహిక నిర్ణయాలు మాత్రమే ఉంటాయని తెలిపారు. అనంతరం రైతులకు విద్యుత్ విషయంలో ఏ ఇబ్బందులు వచ్చిన త్వరగా స్పందిస్తున్నందుకు ఎస్ఈ రమేష్‌బాబును సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు లొంక వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పైడి విఠల్‌రెడ్డి, రాష్ట్రకార్యవర్గ సభ్యుడు అంజయ్య, నగేష్, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరికి తక్కువ మోతాదులో యూరియా వాడాలి

- ఏఈవో రాఘవేంద్ర

బీబీపేట, జనవరి 20: మండలంలోని ఇస్సానగర్ గ్రామంలోని వరి పంటలను ఏఈవో రాఘవేంద్ర పరిశీలించారు. వరిలో కాండం తొలిచే పురుగు పెరుగుతున్నదని దీని నివారణకు వరి నాటిన 20 రోజులలోపు కార్టప్ హైడ్రోక్లోరైడ్ 50శాతం ఎస్‌పీ మందులను ఎకరానికి 400 గ్రాములు లేదా క్లోరాంత నిలిప్రోల్ 60 ఎంఎల్ లేదా టెట్రానిలిప్రోల్ 100 ఎంఎల్ ఎకరానికి పిచికారీ చేసినట్లయితే ఈ పురుగును నివారించవచ్చని సూచించారు. అలాగే వరికి తక్కువ మోతాదులో యూరియాను వాడి అగ్గితెగులు నుంచి పంటలను కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.


స్కీంల పేరిట దోపిడీ

- జిల్లాలో వెలుగు చూస్తున్న ఆర్థిక నేరాలు
- అధిక వడ్డీ ఆశ చూపి డిపాజిట్ల సేకరణ
- బోర్డులు తిప్పేస్తున్న సంస్థలు
- బాధితులుగా మిగులుతున్న శ్రమ జీవులు

బాన్సువాడ టౌన్, జనవరి 20: నేటి రోజుల్లో ఈజీ మనీ సంపాదించడం కోసం కొంత మంది అడ్డదారులు తొక్కుతున్నారు. రోజుకో కొత్త తరహా స్కీంలతో మార్కెట్లోకి వస్తున్నారు. పెట్టుబడి పెడితే తక్కువ కాలంలోనే పెట్టిన పెట్టుబడితో సహా ఎక్కువ మొత్తంలో డబ్బులు చెల్లిస్తామని ఆశల వల వేసి చివరకు సామాన్యుల నడ్డీ విరుస్తున్నారు. మొదట్లో డబ్బును చెప్పిన విధంగానే చెల్లింపులు చేస్తూ, ఎక్కువ సంఖ్యలో డిపాజిటర్లు కాగానే అందిన కాడికి దోచుకుని ఉడాయిస్తున్నారు. మధ్యతరగతి, శ్రమజీవులనే టార్గెట్ చేసుకుని లక్షలు, కోట్లల్లో డబ్బులు దండుకుని మోసం చేస్తున్నారు. చివరకు చేసేదేమిలేక మోసగాళ్ల ఉచ్చులో పడి సామాన్యులే బలిపశువులుగా మారుతున్నారు.

జిల్లాలో ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్న ఆర్థిక నేరాలు

కామారెడ్డి జిల్లా ఆర్థిక నేరగాళ్లకు అడ్డాగా మారింది. గతంలో జిల్లా కేంద్రంలోనే ప్రతీ నెల పొదుపు చేసి ద్విచక్ర వాహనం, గృహోపకరణాలను అందిస్తామంటూ లాటరీలు, స్కీంల పేరుతో ప్రజలను మోసం చేసిన సంఘటనలున్నాయి. అంతేకాకుండా ఒక్కసారి రూ.30వేలు చెల్లిస్తే ప్రతీ నెల 10వేల చొప్పున రూ.లక్షను చెల్లిస్తామంటూ బీర్షెబా పేరున అక్రమార్కులు ఇక్కడి ప్రజలను నిలువు దోపిడీ చేశారు. తాజాగా బాన్సువాడలో సైతం హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి మనీ నెట్‌వర్క్ పేరిట బాగా లాభాలు గడించవచ్చని ప్రజలను నమ్మించి మోసం చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. రూ.ఒక లక్ష చెల్లిస్తే 100 రోజుల్లో ఒక లక్షా 80వేలు చెల్లిస్తామని, 5 లక్షలు ఆపై పెట్టుబడి పెట్టిన వారికి గ్యారెంటీ కింద విజయవాడ హైవే సమీపంలో గల ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయిస్తామని బాండ్ పేపర్లను కూడా రాసిచ్చినట్లు తెలుస్తోంది. ఈ స్కీం ప్రారంభంలో డబ్బులు చెల్లించినప్పటికీ డిపాజిటర్లు ఎక్కువ సంఖ్యలో కాగానే సాధారణ ఎన్నికల సమయం నుంచి సదరు వ్యక్తి డబ్బులు చెల్లించడంలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీరా ఆ వ్యక్తి అందుబాటులో లేకపోవడంతో అయోమయ స్థితిలో పడిపోయారు.



స్థానికులే కమీషన్‌దారులుగా..

హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి పలు పట్టణాల్లో మందుల దుకాణాలను ఏర్పాటు చేశాడు. స్థానికులతో సత్సంబంధాలను ఏర్పాటు చేసుకుని మనీ నెట్‌వర్క్ వ్యాపారం ప్రారంభించాడు. కమీషన్‌దారులను ఎంపిక చేసి వారికి కమీషన్‌ను అందజేస్తూ ఎక్కువ సంఖ్యలో డిపాజిటర్లను చేరేలా ప్రేరేపించాడు. జిల్లాలోని మారుమూల ప్రాంతంలో అదే గ్రామానికి చెందిన వ్యక్తితో సంస్థను ఏర్పాటు చేసినట్లు సమాచారం. కొద్దికాలం తర్వాత అక్కడి ప్రజలు తిరస్కరించడంతో అక్కడి నుంచి బాన్సువాడ పట్టణంలో అదే వ్యక్తి ద్వారా మందుల సంస్థను ఏర్పాటు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఇక్కడే ప్రారంభమైంది అసలు కథ. బాన్సువాడ పట్టణంతో పాటు పల్లెల్లో మధ్యతరగతి, శ్రమజీవులను టార్గెట్ చేసుకుని వారి ద్వారా భారీగా పెట్టుబడులను సేకరించారు. ఒక లక్ష రూపాయల పెట్టుబడి పెడితే వంద రోజుల్లో రెట్టింపు నగదును చెల్లిస్తామని జోరుగా ప్రచారం చేశారు. అందుకనుగుణంగానే ప్రారంభంలో ఒక లక్ష రూపాయలు చెల్లించిన వారికి ప్రతీ సోమవారం 8వేల రూపాయలు హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి ద్వారా చెల్లింపులు జరిగాయి. చాలా మంది ఆశాజీవులు ఈ స్కీంలో చేరి తాము కూడబెట్టుకున్న లక్షలాది రూపాయలను డిపాజిట్ చేశారు. ఆ తర్వాత 5 లక్షల డిపాజిట్లు, 7 లక్షల డిపాజిట్ స్కీంలను తీసుకవచ్చి నమ్మకం కలిగించేందుకు విజయవాడ హైవే సమీపంలో గల ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయిస్తామని బాండ్ పేపర్లను కూడా రాసిచ్చినట్లు తెలుస్తోంది. బాన్సువాడ పట్టణంలో చాలామంది కమీషన్‌దారులుగా మారి ఇతరులతో కూడా పెట్టుబడులు పెట్టించారు. అదేవిధంగా మండలంలోని దేశాయిపేట గ్రామంలో కొంతమంది శ్రమజీవులు స్కీం వలలో చిక్కుకుని విలవిలలాడుతున్నారు.

స్కీం నిర్వహణపై పోలీసుల ఆరా

మందుల దుకాణం పేరిట మనీ నెట్‌వర్క్ వ్యాపారం చేస్తున్న స్కీం నిర్వాహకుడిపై హైదరాబాద్ పోలీసులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. స్కీం నిర్వాహకుడు అరెస్టు కావడంతో మనీ నెట్‌వర్క్ కాస్త తెగిపోయింది. డిపాజిటర్లకు నగదు చెల్లింపులు కూడా జరగడం లేదు. ఆగ్రహించిన డిపాజిటర్లు బాన్సువాడ మండలంలోని ఓ ఆలయం వద్ద కమీషన్‌దారులతో మీటింగ్‌ను ఏర్పాటు చేసి తమ డబ్బులు తమకు చెల్లించాలన్నారు. దీంతో కమీషన్‌దారులు అంతా కలిసి హైదరాబాద్ జైలులో స్కీం నిర్వాహకుడిని కలిసేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. జైలు నుంచి విడుదలయ్యాక పెట్టుబడులు పెట్టిన వారందరికీ నగదు చెల్లింపులు చేస్తామని అందరినీ నమ్మబలుకుతున్నారు. ఏది ఏమైనా విచ్చలవిడిగా స్కీంల పేరిట స్కాంలు చేస్తున్న ఇలాంటి కంపేనీలు, వ్యక్తులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- మహేందర్‌రెడ్డి, ఎస్‌హెచ్‌వో, బాన్సువాడ

రోజురోజుకూ ఆర్థికపరమైన నేరాలు పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అధిక వడ్డీ ఆశ చూపే దళారులు, మోసగాళ్లను నమ్మవద్దు. మోసం జరగకముందే గ్రహించాలి. కష్టపడి దాచుకున్న సొమ్మును మోసగాళ్లకు అప్పగించవద్దు. అత్యాశకు పోయి తిప్పలు పడవద్దు. ఆర్థిక నేరాలకు పాల్పడే వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారు.



నిజాంసాగర్‌లో పరీక్షా కేంద్రాన్ని తనిఖీచేస్తున్న ప్రిన్సిపాల్ సత్యవతి

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

నిజాంసాగర్, జనవరి 20: నిజాంసాగర్ జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25లో 6వ తరగతి ప్రవేశానికై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం జరిగిన నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని నవోదయ ప్రిన్సిపాల్ సత్యవతి తెలిపారు. కామారెడ్డి, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో ఎంపిక చేసిన 27 పరీక్షా కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష కొనసాగిందన్నారు. 5252 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 3728 మంది హాజరయ్యారని, 1524 మంది గైర్హాజర్ అయినట్లు తెలిపారు.

బాన్సువాడ టౌన్: బాన్సువాడ పట్టణంలో జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా సాగింది. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కొన బాన్సువాడ ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాలల్లో ప్రవేశ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 565 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 463 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. 102 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలి

కామారెడ్డి టౌన్, జనవరి 20: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. శనివారం పట్టణంలోని బాలికల పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు తీరును స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మనుచౌదరితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 913 పోలింగ్ కేంద్రాల్లో శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు నిర్వహిస్తున్నామని అన్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్న ఈ క్యాంపులో జనవరి 1, 2024 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ఫారం 6 ద్వారా వారి దరఖాస్తును బీఎల్‌వోలకు అందించాలని తెలిపారు. బీఎల్‌వోల వద్ద ఫారం 6,7,8 అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఓటరుగా జాబితాలో మార్పులు, చేర్పులు, సవరణలు, తొలగింపుకు సంబంధిత ఫారాలలో బీఎల్‌వోలకు సమర్పించాలని కోరారు.

చనిపోయిన వారి పేర్లను తొలగించాలి : అదనపు కలెక్టర్

లింగంపేట: శాసనసభ ఎన్నికల అనంతరం చనిపోయిన ఓటర్ల పేర్లను తొలగించాలని కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రమోహన్ బూత్ లెవల్ అధికారులకు సూచించారు. లింగంపేట మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల అనంతరం చనిపోయిన వారిని గుర్తించి వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించాలని సూచించారు.

జిల్లాలో జోరుగా పేకాట

- అటవీ ప్రాంతంలో ఇష్టారాజ్యంగా పత్తాలాట
- మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న పోలీసులు

నసురుల్లాబాద్, జనవరి 20 : జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ తదితర ప్రాంతాల్లో పత్తాలాట జోరుగా సాగుతోంది. కంచె చేను మేస్తే కాపేమి చేయగలడన్న నానుడిని నసురుల్లాబాద్ పోలీసులు నిజం చేస్తున్నారు. మండలంలో పత్తలాటకు పోలీసులు సహకరిస్తున్నారన్న ఆరోపనలు ఉన్నాయి. గత కొన్ని నెలలుగా నసురుల్లాబాద్ మండలంలోని ఆయా గ్రామాలతో పాటు, అటవీ ప్రాంతంలో గల ఒక తండాలో పేకాటరాయుళ్ల పేకాటస్థావరం నడుపుతూ కోట్ల రూపాయల లావాదేవీలు జరుగుతున్నట్లు మండలంలో చర్చ జరుగుతోంది. దీనికంతటికీ నసురుల్లాబాద్ పోలీసుస్టేషన్‌లో పని చేస్తున్న ఒక పోలీసు కానిస్టేబుల్ ప్రధాన సూత్రధారుడుగా వ్యవహరిస్తున్నాడని వినికిడి. తనను ఎవరూ కూడా ఏమి చేయలేరని, నేను ఉన్నంత కాలం మీ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా నిర్వహించుకోవచ్చునని జూదారులకు అభయహస్తం ఇచ్చినట్లు వినికిడి. దీనికి గాను మండలంలో ఎక్కడైన పేకాట స్థావరం నుంచి ప్రతిరోజూ జూదారుల పేకాట మొదలు కాకముందే నాలుగు నుంచి ఐదు వేల రూపాయల బయానా మాదిరిగా సదరు కానిస్టేబుల్‌కు ముడుపులు ముట్టాల్సిందే. ఇదిలా ఉండగా సదరు కానిస్టేబుల్ ఉన్నతాధికారుల వద్ద తాను బుద్ధిమంతుడునని నిరూపించుకునేందుకు ఇతరులపై ఒకటికి రెండు చాడీలు చెబుతూ పబ్బం గడుపుకుంటున్నాడని, ఠాణాలో పని చేస్తున్న పోలీసు కానిస్టేబుళ్లు ఇతరులకు చెప్పుకోవడం గమనార్హం.

మామూళ్ల మాట సరే.. విధి నిర్వహణ సంగతేంటీ!

కానిస్టేబుల్ ఉద్యోగం పొంది భారత రాజ్యాంగంపై ప్రమాణం చేస్తూ తాను కానిస్టేబుల్ ఉద్యోగాన్ని సక్రమంగా నిర్వహిస్తానని, ప్రమాణం చేసిన ఓ కానిస్టేబుల్ మామూళ్ల మాయలో పడి విధి నిర్వహణను వీధికి ఎక్కిస్తున్నాడు. దీనికి నసురుల్లాబాద్ ఠాణాలో శుక్రవారం ఒక కానిస్టేబుల్ వ్యవహారం నసురుల్లాబాద్ మండలంలోని లింగంపల్లి తండా శివారులో పేకాట స్థావరం నడుస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఐ లావణ్య కానిస్టేబుళ్లను పేకాట స్థావరంపై దాడి నిర్వహించాలని ఆదేశించగా ఆ పనిని పూర్తి చేయాల్సి ఉండగా.. పేకాటరాయుళ్లకు ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్న సదరు కానిస్టేబుల్ పేకాట రాయుళ్లను ముందుగానే సమాచారం అందిస్తూ, మండలంలో స్పెషల్ పార్టీ వచ్చిందని, జూదరులను అక్కడి నుంచి తరిమేయడం కొసమెరుపు. ఇంత జరుగుతున్నా ఎస్సై లావణ్య దృష్టిలో పడకుండా పేకాటరాయుళ్లకు ఆ కానిస్టేబుల్ రక్షణ కవచంగా వ్యవహరించడం విచారకరం. ఈ విషయమై ఎస్సై లావణ్యను వివరణ కోరగా ఈ వ్యవహారం మొత్తం తన దృష్టికి రాలేదని, అలాంటిది జరుగుతున్నట్లు తనకు సమాచారం వస్తే ఎంతటి వారైనా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. అదే విధంగా పేకాటతో రోడ్డు పాలు అవుతున్నామని, మండలంలో ఎక్కడైన పేకాట ఆడుతున్నట్లు ఎవరికైన తెలిసినా పోలీసులకు సమాచారం అందించాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. పేకాట ఆడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతీఒక్కరి బాధ్యత : సిరికొండ రేంజ్ అధికారి వినయ్

సిరికొండ జనవరి 20: పర్యావరణ పరిరక్షణ సమాజంలోని ప్రతీ పౌరుడి బాద్యత అని సిరికొండ అటవీ శాఖ రేంజ్ అధికారి ఎం వినయ్‌నాయక్ అన్నారు. సిరికొండలో నేషనల్ గ్రీన్‌కోర్ యూనిట్ అద్వార్యంలో శనివారం జరిగిన పర్యవరణం, అడవుల పరిరక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులతో కలిసి మొక్కలు నాటిన రేంజ్ అధికారి మాట్లాడారు. ఇందులో హెచ్‌ఎం నర్సయ్య, డీఆర్‌వో గంగారాం, అటవీ శాఖ సిబ్బంది, పాఠశాల ఉపాద్యా యులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియ పరిశీలన

ఏర్గట్ల, జనవరి 20: మండలంలోని బట్టాపూర్ తడపాకల్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలలో ఓటరు నమోదును శనివారం జిల్లా అడిషనల్ కలెక్టర్ చిత్రామిశ్రా పరిశీలించారు. శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా అడిషనల్ కలెక్టర్ పోలింగ్ కేంద్రాల వద్ద బిఎల్‌వోలతో మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన వారికి ఫారం 6 కొత్త ఓటరు కార్డు దరఖాస్తులు స్వీకరించాలని, అలాగే మార్పుల కోసం ఫారం 8, ఫారం 7 జాబితాను ఆయా గ్రామ పంచాయతీల ద్వారా వివరాలు సేకరించాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహమ్మద్ యూసుఫ్, ఆరై సదానంద్‌లు పాల్గొన్నారు.

ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలి

● కొలిప్యాక్‌లో లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

జక్రాన్‌పల్లి, జనవరి20: ప్రజలు ఆయురారోగ్యాలతో ఆనందంగా సుఖసంతోషాలతో ఉండాలని, వర్షాలు కురిసి పంటలు పండాలని దేవుడిని వేడుకున్నట్లు రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కొలిప్యాక్ గ్రామంలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో భూపతిరెడ్డి ఆయన సతీమణి వినోదిని ప్రత్యేక పూజలు చేసి మొక్కులను తీర్చుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో ఎమ్మెల్యే దంపతులు యజ్ఞం చేశారు. ఆలయంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఈ ఆలయంలో పూజలు చేసి అసెంబ్లీ ఎన్నికల్లో తాను గెలువాలని మొక్కుకున్నాని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, అర్గుల్ ఉపసర్పంచ్ గోర్త రాజేందర్, ఎంపీటీసీ అనిత, కొలిప్యాక్ సింగిల్‌విండో మాజీ చైర్మన్ మాధురి బాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మద్దుల భాస్కర్, ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కళాశాలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల ఫిర్యాదు



డీఐఈవోకి ఫిర్యాదు చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

నిజామాబాద్ అర్బన్, జనవరి 20 : నగరంలోని ముబారక్‌నగర్‌లో, వినాయక్‌నగర్‌లో కమర్షియల్ భవనాల్లో ఏర్పాటు చేస్తున్న ఆల్ఫోర్స్ కళాశాలకు అనుమతులు లేవని, అనుమతులు వచ్చాయంటూ అడ్మిషన్లు తీసుకుంటున్న సదరు విద్యాసంస్థపై చర్యలు తీసుకోవాలని శనివారం ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, టీవీయూవీ, పీడీఎస్‌యు, జీవీఎస్, టీఎస్ఎఫ్ విద్యార్థి సంస్థలు డీఐఈవో రఘురాజ్‌కు ఫిర్యాదు చేశారు. కమర్షియల్ భవనాల్లో కళాశాలలు ఏర్పాటు చేయవద్దని నిబంధనలు ఉన్నా.. సదరు కళాశాల ఇతర జిల్లాలలో వచ్చిన ర్యాంకులను ఇక్కడ చూపిస్తూ పెద్ద పెద్ద హోర్డింగ్‌లు పెట్టి ప్రచారాలను నిర్వహిస్తూ విద్యార్థులను మోసం చేస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్, టీవీయూవీ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ లాల్‌సింగ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం అన్నారు. అబద్ధపు ప్రచారాలు చేసి విద్యార్థులను మోసం చేస్తున్న సదరు కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. క్రిమినల్ కేసులు పెట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యు జిల్లా కార్యదర్శి గణేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షురాలు అంజలి, జైత్రాం రాథోడ్, మహేష్‌రెడ్డి, మహేష్‌సందీప్, తదితరులు పాల్గొన్నారు.

● ఆల్ఫోర్స్ కళాశాలకు అనుమతులు లేవు : డీఐఈవో రఘురాజ్

నగరంలో ఏర్పాటు చేస్తున్న ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలకు బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియెట్ ఇంతవరకు అనుమతి ఇవ్వలేదని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖ అధికారి రఘురాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. పలు విద్యార్థి సంఘాల ఫిర్యాదు మేరకు ఆయన స్పందించారు. బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియెట్, జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖ నుంచి ఎలాంటి అనుమతి లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామన్నారు. 2024-25 విద్యాసంవత్సరానికి గాను ఇంటర్మీడియెట్ బోర్డ్ నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కాలేదన్నారు. కాబట్టి విద్యార్థులు, తల్లిదండ్రులు మోసపోవద్దన్నారు.

టీబీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలి

కోటగిరి,జనవరి20: మండలంలో టీబీ లక్షణాలు కలిగి వారు ఎవరైనా ఉంటే తక్షణమే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలని ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ సూచించారు. కోటగిరి మండలంలోని యాద్గార్‌పూర్ గ్రామంలో శనివారం టీబీ వ్యాధి నిర్ధారణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మనోహర్ రెడ్డి, ఎంపీవో మారుతి, సర్పంచ్ విజయ, నాయకులు సాయన్న, పంచాయతీ కార్యదర్శి సునంద, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మండల స్థాయి టాలెంట్ టెస్ట్

బీర్కూర్, జనవరి 20: బీర్కూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు మండల స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు వెంకన్న తెలిపారు. ఈ టాలెంట్ టెస్టులో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. బీర్కూర్ జెడ్‌పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన టెన్త్ ఇంగ్లీష్ మీడియం విద్యార్థి విఘ్నేష్‌కుమార్, మౌసీనా, శ్రీనిజ, దామరంచ, జడ్పీహెచ్ఎస్‌కు చెందిన అమృత, అక్షిత, గాయత్రి, ఎంజేపీకి చెందిన పవన్, సిద్దార్థ్, కిషోర్‌లు బహుమతులు గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకన్న, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ కార్డు ప్రతీ ఒక్కరు తీసుకోవాలి

కోటగిరి,జనవరి20: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ కార్డులను ప్రతీ ఒక్కరు తీసుకోవాలని ఎంపీడీవో మనోహర్‌రెడ్డి సూచించారు. కోటగిరి మండలంలోని ఎత్తొండ, యాద్గార్‌పూర్ గ్రామాలలో శనివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు.ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో ఎన్‌సీడీ కార్యక్రమంలో భాగంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. నిరంతరం యోగా, శారీరక శ్రమ, వాకింగ్ చేయడం వల్ల వ్యాధులు అదుపులో ఉంటాయని ఆరోగ్య అధికారి సూచించారు. ప్రతీ ఒక్కరు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మారుతి, ఏపీవో గంగారాం, ఎంఎల్ హెచ్‌పీ హిమాంజలి, సూపర్‌వైజర్ జ్యోతి,బ్యాంక్ మేనేజర్ సుధాకర్, పంచాయతీ కార్యదర్శి ఉమాకాంత్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

కామారెడ్డిటౌన్,జనవరి 20:కామారెడ్డి పట్టణంలోని గోసంగి కాలనీకి చెందిన అంద్రాసి అనిత కనిపించకుండా పోయినట్లు సీఐ చంద్రశేఖర్‌రెడ్డితెలిపారు. ఈ నెల 19న ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లిపోయిందని ఆమె తల్లిదండ్రులు చుట్టు పక్కల, తెలిసిన వారి వద్ద వెతికిన ఆచూకీ లభించలేదని అన్నారు. పోలీసుస్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు. అనిత ఆచూకీ తెలిసినచో కామారెడ్డి పోలీసుస్టేషన్‌లో తెలియజేయాలన్నారు.

మోడల్ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నవీపేట,జనవరి20: మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్ తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే ప్రక్రియ ప్రారంభమైందని ఫిబ్రవరి 22వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. అలాగే 7,8,9,10వ తరగతిలలో ఖాళీగా ఉన్న సీట్లకు సైతం ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

ఆటల పోటీలు ఆరోగ్యానికి ఎంతో మేలు

● జిల్లా న్యాయాధికారి సునీత కుంచాల

నిజామాబాద్ లీగల్, జనవరి 20: నిత్యం బిజీగా ఉండే జీవన విధానంలో ఆటల పోటీలో ఎంతో ఉత్సాహంగా పాల్గొనడం ఆరోగ్యానికి కూడా వ్యాయామం చేసినట్లు ఉంటుందని జిల్లా న్యాయాధికారి సునీత కుంచాల అన్నారు. శనివారం నిజామాబాద్ జిల్లా న్యాయవాదులందరూ పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో క్రికెట్ మ్యాచ్ ఆడారు. జిల్లా న్యాయాధికారి ఆటల పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఆటల పోటీలో క్రికెట్, క్యారమ్, షటిల్, చెస్, మొదలైన ఆటల పోటీలు మానసిక ఉత్తేజాన్ని నింపుతాయని తెలిపారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవదాస్ చందక్, స్పోర్ట్స్ కల్చరల్ సెక్రెటరీ సత్యనారాయణ, బిట్ల రవి, సెక్రెటరీ బాగిచరణ్ మాట్లాడుతూ జనవరి 26ను పురస్కరించుకొని క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని అన్నారు. ఇందులో క్యారమ్, చెస్, టెన్నీస్, క్రికెట్‌లో 200 మందికిపైగా పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయాధికారులు సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీకాంత్‌బాబు, జూనియర్ సివిల్ న్యాయాధికారి గోపికృష్ణ, కుష్బూ ఉపాధ్యాయ, సీనియర్ న్యాయవాదులు రాజ్‌కుమార్ సుబేదార్, శ్రీహరి ఆచార్య, బిల్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1,2,3,4 ఫౌండేషన్ ఉచిత కోర్సులకు దరఖాస్తుల తేదీ పొడగింపు

నిజామాబాద్ అర్బన్, జనవరి 20: గ్రూప్-1,2,3,4 ఫౌండేషన్ కోర్సులకు ఉచిత కోచింగ్ తరగతులు ఫిబ్రవరి 1 నుంచి నిజామాబాద్ బీసీ స్టడీ సర్కిల్‌లో ప్రారంభమవుతాయని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలకు చెందిన అర్హులైన అభ్యర్థులు గతంలో గడువును ఈనెల 24 వరకు పొడగించినట్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టీఎస్‌బీసీస్టడీసర్కిల్.సీజీజీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు ఆన్‌లైన్‌లో చేసుకోవాలని తల్లిదండ్రుల వార్షిక ఆదాయం 5లక్షలలోపు కలిగి ఉండాలన్నారు. అభ్యర్థుల ఎంపిక విధానం రిజర్వేషన్, డిగ్రీ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా ఉంటుందని నిబంధనల ప్రకారం మెటీరియల్ అందిస్తామన్నారు. ఇతర వివరాలకు 08462-241055 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు మిట్టపల్లి క్రీడాకారిణి



క్రీడాకారిణి శ్రీతికను అభినందిస్తున్న పాఠశాల హెచ్ఎం సుశీల్ కుమార్

డిచ్‌పల్లి, జనవరి 20: ఆర్మూర్‌లో పట్టణంలో ఈ నెల 16నుంచి 18వరకు జరిగిన 67వస్కూల్ గేమ్స్ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అండర్-14 పోటీల్లో జిల్లా బాలుర జట్టు మనితేజా క్యాంస పతకం అందుకోగా బాలికల విభాగంలో మెండే శ్రీతిక జట్టు విజయంలో కీలక పాత్ర పోషించి గోల్డ్ మెడల్ అందుకొని ఫిబ్రవరి 3నుంచి 6వరకు ఛత్తీస్‌గడ్ లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుశీల్ కుమార్ వ్యాయమా ఉపాధ్యాయుడు మర్కంటి గంగా మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో రాష్ట్ర జట్టును ప్రథమ స్థాయిలో ఉండేలా కృషి చేయలన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు రాజశేఖర్, రాఘవేందర్, బాలరాజు, పోశెట్టి, నిరంజన్, అభినందించారు.

రేపు మాంసం, చికెన్ దుకాణాలను మూసి ఉంచాలి: వీహెచ్‌పీ

నవీపేట,జనవరి20: మండల కేంద్రంలో ఈ నెల 22న మాంసం, చికెన్ దుకాణాలను మూసి ఉంచే విధంగా చూడాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు నవీపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో డీఎల్‌పీవో నాగరాజు, ఎంపీవో రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి రవీందర్ నాయక్‌లకు వినతిపత్రం అందజేశారు. అయోధ్యలోని రామ మందిరంలో శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా మాంసం, చికెన్ దుకాణాలను మూసి ఉంచాలని కోరారు. అలాగే ప్రైవేటు పాఠశాలలను మూసి ఉంచాలని పాఠశాలల యాజమాన్యాలు, దుకాణాలను మధ్యాహ్నం 2గంటల వరకు మూసి ఉంచాలని వర్తక సంఘం సభ్యులకు కూడా తమ వినతిపత్రం అందజేశారు.

అక్రమ మద్యాన్ని తరలిస్తే కఠిన చర్యలు

● 23న ఐదు ద్విచక్ర వాహనాల వేలం పాట

బోధన్ రూరల్, జనవరి 20: దేశీదారు, మత్తు పదార్థాలను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని బోధన్ ఎక్సైజ్ సీఐ రూప్‌సింగ్ అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 23వ తేది మంగళవారం ఎక్సైజ్ శాఖ కార్యాలయ ఆవరణలో ఐదు ద్విచక్ర వాహనాల వేలం పాట నిర్వహించబడుతుందన్నారు. అక్రమ మద్యం తరలిస్తుండగా ఈ వాహనాలను పట్టుకున్నామని, శిథిలావస్థకు చేరడంతో వేలం పాట నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల వారు 23వ తేది 10 గంటల లోపు బోధన్ పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

● ఆర్మూర్ సీనియర్ సివిల్ న్యాయాధికారి నజీమసుల్తానా



మాట్లాడుతున్న ఆర్మూర్ సీనియర్ సివిల్ న్యాయాధికారి నజీమసుల్తానా

జక్రాన్‌పల్లి, జనవరి20:చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండా లని ఆర్మూర్ సీనియర్ సివిల్ న్యాయాధికారి నజీమసుల్తానా అన్నారు. శనివారం జక్రాన్‌పల్లిలో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో న్యాయ చైతన్యసదస్సు నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆర్మూర్ సీనియర్ సివిల్ న్యాయాధికారి నజీమసుల్తాన మాట్లాడుతూ చట్టాలపై ప్రజలు కట్టుబడి ఉండాలని, చట్టాలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. గ్రామాలలో వీడీసీలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని ఇష్టమొచ్చినట్లు ప్రవర్తిస్తే చట్టపరంగా చర్యలు తప్పవన్నారు.చట్టం ఎవరికి చుట్టం కాదని, చట్టం ముందర అందరు సమానమేనన్నారు. చట్టాన్ని ఎవరు చేతుల్లోకి తీసుకొని తప్పుచేసిన వారికి చర్యలు తప్పవన్నారు. దేశంలో చట్టమే గొప్పదన్నారు. ఏమైనా భూసమస్యలు ఉంటే ఇతర సమస్యలు సివిల్‌కోర్టు, పోలీస్‌శాఖ,రెవెన్యూశాఖ అధికారులు వద్దకు వెళ్లి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. చట్టాల గురించి తెలుసుకొని ప్రతీఒక్కరు చట్టాన్ని గౌరవిస్తూ నడుచుకోవాలన్నారు.గ్రామాల్లో వీడీసీలు గ్రామాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. అనంతరం అడిషనల్ డీసీపీ జయరాం మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను తయారు చేస్తోందని చట్టాలను అతిక్రమించిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. యువతులను, విద్యార్థినులను, మహిళలను వేధిస్తే ఫోక్స్ చట్టం కింద చట్టరీత్యా చర్యలు తపవన్నారు.మహిళలను పురుషులతో సమానంగా వ్యవహరిస్తే సమాజం బాగుపడుతుందన్నారు. చట్టాన్ని ఎవరు చేతుల్లోకి తీసుకోవద్దని, గ్రామాల్లో వీడీసీలు గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని, చట్టాన్ని తీసుకొని ఇష్టమొచ్చినట్టు ప్రవర్తిస్తే చర్యలు తప్పవన్నారు. చట్టాలు, సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వినోద్ కుమార్, ఏసీపీ విజయసారథి, ఎస్సై సిహెచ్.తిరుపతి, ఎంపీపీ కుంచాల విమల రాజు, ఉపసర్పంచ్‌లు బాలకిషన్, గోర్త రాజేందర్, ఎంపీటీసీ రూపాల గంగారెడ్డి, మరియా సతీష్, మండల కోఆప్షన్‌సభ్యుడు అక్బర్‌ఖాన్, తహసీల్దార్ ఎం.ఎ.ఖలీం, ఎంఈవో శ్రీనివాస్, ఎంపీవో యుసుఫ్‌ఖాన్, ఆర్మూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిన్నారెడ్డి, వివిధ గ్రామాల వీడీసీసభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

తొర్లికొండలో వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు

జక్రాన్‌పల్లి, జనవరి20: మండలంలోని తొర్లికొండ గ్రామంలో శనివారం శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయ ఉత్సవాలను భక్తులు, గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారు జాము నుంచే భక్తులు కొండపైకి చేరుకున్నారు. అనంతరం స్వామివారి పల్లకీని భక్తులు కొండపై చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఆలయంలో భక్తులు, గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద భక్తుల కోసం అన్నదానం నిర్వహించారు. నూతనంగా నిర్మించినున్న వేంకటేశ్వర స్వామి నిర్మాణానికి భక్తులు, గ్రామస్థులు విరాళాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వీడీసభ్యులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

తెలుగు విభాగాపు అధిపతిగా డా.లక్ష్మణ చక్రవర్తి

డిచ్‌పల్లి, జనవరి 20: తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ బుర్ర వెంకటేశం ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరి శనివారం తెలుగు విభాగాధిపతిగా డా.సీహెచ్ లక్ష్మణచక్రవర్తిని నియామిస్తూ ఉత్వర్వులు అందజేశారు. చక్రవర్తిని విభాగాధిపతిగా నియామించినందుకు వీసీ, రిజిస్ట్రార్‌లకు ధన్యవాదలు తెలిపారు. ఈ నియామకం పట్ల తెలుగు శాఖ అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపారు.

ఓటరు నమోదు కేంద్రాల పరిశీలన



పెర్కిట్‌లో ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది

మోపాల్, జనవరి 20: మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాలను మోపాల్ తహశీల్దార్ ఖాజా ఖుతుబుద్దీన్ శనివారం పరిశీలించారు. ఓటరు నమోదును సక్రమంగా నమోదు చేసే విధంగా అధికారులు చూడాలని కిందిస్థాయి అధికారులకు తహశీల్దార్ సూచించారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటరు నమోదు చేసుకునే విధంగా గ్రామాల్లో యువతకు అవగాహన కల్పించే విధంగా చూడాలన్నారు. రెండు రోజుల పాటు ఈ ఓటరు నమోదు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. మండలంలోని బోర్గాం(పి), మోపాల్, తదితర గ్రామాల్లో ఈ కార్యక్రమం కొనసాగుతుంది.

మోస్రా: మండలంలోని 76 నుంచి 82వరకు గల పోలింగ్ కేంద్రాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియను శనివారం తహసీల్దార్ శ్రీకాంత్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా మరణించిన వారి ఓటు హక్కును తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్ సాయిలు, బీఎల్‌వోలు కాశీరాం, రాము, సుజాత, సుమలత, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్, కొటార్మూర్ గ్రామాలలో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల కొటార్మూర్ ప్రాథమిక పాఠశాలలో మున్సిపల్ సిబ్బంది ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించింది. ఆదివారం రోజు కూడా ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నామని, యువకులు ఓటరు నమోదు కేంద్రాన్ని సంప్రదించి తమ ఓటు నమోదు చేసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో చెన్న గంగా మోహన్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

డొంకేశ్వర్: ఓటరు నమోదు కార్యక్రమం ఆదివారం ముగింపు ఉంటుందని డొంకేశ్వర్ తహసీల్దార్ రాములు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 18ఏళ్లు నిండిన వారందరు ఓటరు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. మండలంలోని గ్రామపంచాయతీ కేంద్రాల వద్ద బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని తెలిపారు. కొత్త ఓటరు నమోదుతో పాటు ఓటర్ జాబితాలో ఏవైనా మార్పులు, చేర్పులు ఉంటే ఫారం-6, ఫారం-8 ద్వారా సరి చేసుకుని వెఉలుబాటు కల్పించినట్టు ఆయన సూచించారు.

జైశ్రీరాం అక్షరూపంలో మిసిమి విద్యార్థులు

కమ్మర్‌పల్లి, జనవరి 20: మండల కేంద్రంలో 22న అయోధ్యలోని రామ మందిరంలో బాలరాముడి విగ్రప్రాణపత్రిష్ఠ కార్యక్రమం జరుగనున్న తరుణంలో శనివారం కమ్మర్‌పల్లి మండకేంద్రంలోని మిసిమి ఉన్నత పాఠశాల విద్యార్థులు జైశ్రీరాం పేరును అక్షరూపంలో కూర్చి అలరించారు. పాఠశాల కరస్పాండెంట్ బాలిరవీందర్, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులు ఇంగ్లీష్,హిందీ భాషల్లో జైశ్రీరాం నినాదాన్ని అక్షర రూపంలో చూపించారు.

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేయిర్‌కు మంథని విద్యార్థిని

ఆర్మూర్‌రూరల్, జనవరి20: ఆర్మూర్ మండలం మంథని ఉన్నత పాఠశాల విద్యార్థినిలు రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్‌కు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయురాలు శ్యామలబాయి తెలిపారు. ఇటీవల నిజామాబాద్‌లో జరిగిన జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌లో మంథని విద్యార్థినిలు లాస్య, అంకిత, ఆరోగ్య విభాగంలో కూరగాయలు, పండ్లు, ఆవు పేడ బుడిద, ఆకులు, వేర్లు, చెక్క పొట్టు, బూడిదలను వాడి కూరగాయలు, పండ్లను 15రోజుల పాటు సహజ పద్దతులతో తాజాగా నిల్వ చేయవచ్చన్నారు. ఇదీ తక్కువ ఖర్చుతో ఇంట్లోనే అందరు తయారు చేసుకునే విధంగా రూపొందించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థినిలను గైడ్ టీచర్ మల్లేష్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, కోకిల నాగరాజు, విజయకుమారి, అభినందించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్రీడా సమ్మేళనం

పెర్కిట్, జనవరి20: స్వామి వివేకానంద జయంతి ఉత్సావాలలో భాగంగా శనివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నిర్వహిస్తున్న క్రీడా సమ్మేళనంలో ఏబీవీపీ విభాగ్ సంఘటన నాయకులు రాజశేఖర్ పాల్గొని మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల పట్ల కూడా ఆసక్తి పెంపొందించడానికి ఈ సమ్మేళనం ఎంతగానో దోహద పడుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణ కృష్ణ, సునిల్, సుహాస్‌రెడ్డి,బాలకృష్ణ, జెస్సు అనిల్, పాల్గొన్నారు.

టీయూ క్యాంపస్‌లో హాస్టల్ వసతి కల్పించాలి

● ఎన్ఎస్‌యూఐ డిమాండ్

డిచ్‌పల్లి,జనవరి 20: తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని సారంగ పూర్ బీఈడీ కళాశాల విద్యార్థులకు ప్రధాన క్యాంపస్ డిచ్‌పల్లి లో హస్టల్ సౌకర్యం కల్పించాలని టీయూ రిజిస్ట్రార్ యాదగిరి కి ఎన్ఎస్ యూఐ అధ్యక్షుడు శ్రీశైలం ఆధ్వర్యంలో విద్యార్థులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగాఎన్ఎస్‌యూఐ కార్యదర్శి సాగర్ నాయక్ మాట్లాడుతూ.. వర్సిటీలో 4సంవత్సరాల నుంచి సారంగపూర్‌లోని బీఈడీ కళాశాల విద్యార్థులకు మెయిన్ క్యాంపస్‌లో హస్టల్ కల్పిస్తున్నారని ఈ ఏడాది కూడా హస్టల్ సౌకర్యం కల్పించలన్నారు. వర్సిటీలో చదివే విద్యార్థులు వివిధ జిల్లాల నుంచి వస్తారు కాబట్టి సెమిస్టర్, ఇంటర్నల్ ఎక్సామ్స్ సమయంలో హస్టల్ సదూపాయం లేక ఇబ్బందులు పడుతున్నారని హస్టల్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శి రాజేందర్, పాల్గొన్నారు.

బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా పెద్దోళ్ల గంగారెడ్డి

పెర్కిట్,జనవరి20: భారతీయ జనతా పార్టీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా పెద్దోళ్ల గంగారెడ్డి నియమితులయ్యారు.శనివారం పట్టణంలోని ఆయన నివాసంలో బీజేపీ నాయకులు పూలమాల శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పెద్దోళ్ల గంగారెడ్డి మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిసాన్‌రెడ్డి, రాష్ట్ర ప్రధానకార్యదర్శి బండి సంజయ్‌ఆశీస్సులతో రాష్ట్ర కిసాన్‌మోర్చ అధ్యక్షుడిగా ఎన్నికైనందున ప్రతీఒక్కరికి ధన్యావాదాలు తెలిపారు. రాబోయే కాలంలో కేంద్రంలో, రాష్ట్రంలో అమలవుతున్న రైతుల పాలసీలను రైతుల వద్దకు వారికి ప్రయోజనం చేకూరేలా ప్రయత్నం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జెస్సు అనిల్, పొల్కం వేణు, ఆకుల రాజు, డమాంకర్ శ్రీనివాస్, వివిధ మోర్చల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా మృత దేహం లభ్యం

బోధన్ రూరల్/వర్ని, జనవరి 20 : రుద్రూరు మండలం అంబం గ్రామ శివారులోని నిజాంసాగర్ కెనాల్‌లో శనివారం మహిళ మృత దేహం లభించిందని రుద్రూరు ఏఎస్సై రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బొమ్మన్‌దేవ్‌పల్లి గ్రామానికి చెందిన విఠవ్వ (71) అనే మహిళ మనస్థాపానికి గురై ఈనెల 12వ తేదిన బొమ్మన్‌దేవ్‌పల్లి గ్రామ చెరువులో ఆత్మహత్య యత్నానికి పాల్పడిందన్నారు. శనివారం విఠవ్వ మృత దేహం అంబం శివారులో లభించిందన్నారు. మృతురాలి కుమారుడు గంగారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామన్నారు.

గణితం టాలెంట్ టెస్టులో విజేతలకు బహుమతుల ప్రదానం

కోటగిరి,జనవరి20: పొతంగల్ పీఆర్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం మండల స్థాయి గణితం టాలెంట్ టెస్టులను నిర్వహించారు. ఈ పోటీలలో పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు పీఆర్టీయూ శాఖ ఆధ్వర్యంలో బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు సూదం వెంకటేష్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సాయిలు, నోడల్ అధికారి లోల శంకర్, కారేగాం ప్రధానోపాధ్యాయులు దుర్గారావు, పీఆర్టీయూ రాష్ట్ర నాయకులు సత్యనారాయణ, నాగనాథ్, ఉదయ్, వెంకటేశ్వర్ రెడ్డి, శివ కుమార్, శ్యామ్, హన్మాండ్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ముప్కాల్ విద్యార్థుల ఎంపిక

ముప్కాల్, జనవరి20: ముప్కాల్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఆన్‌లైన్ విభాగంలో నిర్వహించిన జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ముప్కాల్ విద్యార్థులు ప్రశాంత్, అభినవ్, ప్రణవ్, చైతన్యలు ఎంపికైన పాఠశాల హెచ్ఎం ఎం.గంగారాం తెలిపారు. ముప్కాల్ పాఠశాల విద్యార్థులు కాంపిటిషయన్ తికింగ్ అంశంలో మల్టిటాస్కింగ్ రోబోట్ అనే అంశంపై ఉత్తమ ప్రతిభ కనబరిచినందున రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని పతకాలు సాధించాలని కోరారు. ఈ ప్రదర్శనకు సహకరించిన ఫిజికల్ సైన్స్ టీచర్‌లు కనఖాద్రి, సురేష్‌కుమార్, నరేష్, బాలగంగాధర్‌లను, విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేందర్, నవీన్, అంజాద్, సునీత, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మారం, అనంతగిరిలలో గ్రామసభలు

నవీపేట,జనవరి20: మండలంలోని ధర్మారం, అనంతగిరిలలో శనివారం గ్రామసభలు నిర్వహించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు సంబంధించి ఈ గ్రామసభలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. డ్రోన్ ద్వారా రసాయన ఎరువులు పిచికారి చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ధర్మారం సర్పంచ్ మాధవి, అనంతగిరి సర్పంచ్ రవీందర్ రెడ్డి, ఎంపీటీసీ సాయిలు, ఎంపీవో రామకృష్ణ, ఏపీఎం భూమేష్ గౌడ్, పంచాయతీ రాజ్ శ్రావణ్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాము, మెడికల్ ఆఫీసర్ సామ్రాట్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముల విగ్రహ ప్రతిష్ఠాపన రోజు భక్తులు నిష్ఠగా ఉండాలి

బోధన్ రూరల్, జనవరి 20: అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా హిందూ భక్తులందరూ నిష్ఠగా ఉండాలని వేద పండితులు ప్రవీణ్ మహారాజ్ అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని మారుతి మందిరంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి హనుమాన్ చాలీసా పారాయణంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ సోమవారం రాముల వారి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా బోధన్‌లోని భక్తులు ఎలాంటి మాంసపు పదార్థాలు తినవద్దని, మత్తు పానియాలు తాగొద్దని, ధర్మ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరు పాటు పాడాలని ఆయన అన్నారు. ఈ కార్య క్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అడ్మిషన్ల గడువు పెంపు

నిజామాబాద్ అర్బన్, జనవరి 20: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ,పీజీ అడ్మిషన్ల గడువు ఈనెల 31వరకు పొడగించినట్లు అధ్యాయన కేంద్ర రీజినల్ కోఆర్డినేటర్ రంజిత ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సర్టిఫికెట్లు, పాస్‌పోర్టు సైజు ఫోటోలతో స్టడీ సెంటర్‌ను సంప్రదించాలన్నారు. డిగ్రీ ద్వితీయ, తృతీయ,పీజీద్వితీయ సంవత్సరానికి రినివల్ చేసుకునేందుకు ఈనెల 31చివరి తేదీ అని ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమెతెలిపారు.

కలిగోట్‌లో పుట్ట శివాలయాన్ని శుద్ధి

జక్రాన్‌పల్లి, జనవరి20: మండలంలోని కలిగోట్ గ్రామంలో పుట్ట శివాలయాన్ని శనివారం సాయంత్రం బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులచారి, బీజేపీ నాయకులు శుద్ధి చేశారు. ప్రధాని నరేంద్రమోదీ సంకల్పంతో అయోధ్య రామాలయ ప్రతిష్ఠాపన సందర్భంగా ఆలయాల శుద్ధిలో భాగంగా కలిగోట్ పుట్ట శివాలయంలో దినేష్‌కులచారి, బీజేపీ నాయకులు ఆలయం ఆవరణలో ఉన్న చెత్తను ఊడ్చారు. అనంతరం ఆలయం ఆవరణలో నీళ్లు పట్టి శుద్ధి చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, పార్లమెంట్ కన్వీనర్ భూమన్న, అసెంబ్లీ కన్వీనర్ పద్మరెడ్డి, తొర్లికొండ మాజీసర్పంచ్ ఈర్ల బాలయ్య, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


రామ మందిర నిర్మాణ వాల్ పోస్టర్ల కార్యక్రమం

పెర్కిట్, జనవరి20: ఆర్మూర్ పట్టణంలోని బీజేపీ క్యాంపు కార్యాలయం వద్ద శనివారం బీజేపీనాయకులు అయోధ్య రామమందిర నిర్మాణ కార్యక్రమం వాల్ పోస్టర్‌లను అతికించారు. 500ఏళ్ల నుంచి నిరీక్షిస్తున్న రామ మందిర నిర్మాణ కార్యక్రమం జయప్రదామైన సందర్భంగా కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జెస్సు అనిల్, పులి యుగంధర్, ఖాందేశ్ ప్రశాంత్, గుగులోత్ తిరుపతినాయక్, బాశెట్టి రాజ్‌కుమార్, తంగలపల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నిశితలో ప్లేస్‌మెంట్

నిజామాబాద్ అర్బన్, జనవరి 20: నగరంలోని నిశిత డిగ్రీ కళాశాల (అటానమాస్)లో శనివారం పలు కంపెనీల ఆధ్వర్యంలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఈ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో పాల్గొనే అవకాశం కల్పించారు. 24(7), ఏఐ కంపెనీలు నిర్వహించిన డ్రైవ్‌కు కళాశాల నుంచి సుమారు 50 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ఛైర్మన్ నిఖిల్, కోఆర్డినేటర్ రాజులు తెలిపారు. కంపెనీలకు చెందిన ప్రతినిధులు నరేందర్‌గౌడ్, నవీన్, ప్రియాంక, హర్ష, నాందీ ఫౌండేషన్ నుంచి స్వాతి, ప్రవీణ్, టాస్క్ నుంచి రఘుతేజ, హన్మంతులు ఈ డ్రైవ్‌ను నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ ఓంప్రకాష్, ప్రిన్సిపల్ స్వప్న, వైస్ ప్రిన్సిపల్ రఘువీర్ అభినందించారు.

నేసనల్ మోటార్ సైకిల్ రేసింగ్‌లో జిల్లా వాసికి మూడో స్థానం



క్యాంతం మన్విత్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, జనవరి 20:చెన్నైలో శుక్రవారం జరిగిన ఇండియన్ నేషనల్ మోటార్ సైకిల్ రేసింగ్‌లో జిల్లాకు చెందిన క్యాంతం మన్విత్‌రెడ్డి మూడో స్థానంలో నిలిచాడు. వేల్పూర్ మండల కేంద్రానికి చెందిన రమణ రెడ్డి కుమారుడు మన్విత్‌రెడ్డి కుటుంబం బెంగుళూరులో స్థిరపడింది. మన్విత్‌రెడ్డి మోటార్ సైకిల్ రేసింగ్‌లో తన ప్రతిభను చాటుతూ ఆరు రౌండ్లలో జరిగిన ఫైనల్ పోటీలలో మూడో స్థానంలో నిలిచి సత్తా చాటాడు. ఈ సందర్భంగా మన్విత్‌రెడ్డిని మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి అభినందించారు.

గురుకుల అతిథి అధ్యాపకురాలి మృతి

ఆర్మూర్‌టౌన్, జనవరి20: పట్టణంలోని సాంఘిక సంక్షేమ మహిళ డిగ్రీ కళాశాల అతిథి అధ్యాపకురాలు సీహెచ్.నిశిత అనారోగ్యంతో మృతి చెందినట్టు కళాశాల ప్రిన్సిపాల్ ధనవేణి తెలిపారు. కళాశాలలో కంప్యూటర్ సైన్స్ బోధించేవారని గత కొంతకాలంగా క్యాన్సర్ సమస్యతో బాధ పడుతున్నాదని తన విధులను బోధనను చక్కగా బోధించే అధ్యాపకురాలు ఆకస్మాత్తుగా మృతి చెందడంతో విద్యార్థినిలు, తోటి అధ్యాపకులు కన్నీంటి పర్యాంతం అయ్యారు. ఆమె మృతి పట్ల కుటుంబ సభ్యులకు సంతాపం వ్యక్తం చేశారు.

'22న విద్యా సంస్థలకు సెలవు ప్రకటించాలి '

బోధన్ రూరల్, జనవరి 20: అయోధ్యలో 22న విగ్రహ ప్రతి ష్ఠాపన సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలకు సెలవులు ప్రకటించాలని భారతీయ విద్యార్థి సేన జిల్లా కోకన్వీనర్ చింతాకుల లోకేష్ గౌడ్ ప్రభుత్వాన్నికోరా రు. దేశ ప్రజలు 500 సంవత్సరాల నుంచి అయోధ్య రామాలయం కోసం ఎదురు చూస్తున్నారన్నారు. అత్యంత శుభ దినమైన డిసెంబర్ 22న రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రక టించాలని కోరారు. ఆయన వెంట బీవీఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

మద్నూర్‌లో బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమం

మద్నూర్, జనవరి 20: మండల కేంద్రంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ గర్ల్స్ చైల్డ్ ప్రోగ్రాం, బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్ కవిత, మాట్లాడుతూ ఆడ పిల్లలు సమాజానికి మణిహారం లాంటి వారని, వారి బంగారు భవితకు బాటలు వేయాలని పిలుపునిచ్చారు. జాతీయ బాలికల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా రెండవ రోజు మహిళా సాధికారికత కేంద్ర సిబ్బంది శారదా పాల్గొన్నారు.



నిజాంసాగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసిన దొంగలు

ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసిన దుండగులు

నిజాంసాగర్, జనవరి 20: మండల కేంద్రానికి సమీపంలోని ఆయిల్ కుంట వద్ద గల ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం రాత్రి దుండగులు ధ్వంసం చేశారు. అందులో ఉన్న ఆయిల్, కాయిల్స్ తదితర వాటిని దోచుకెళ్లారు. వీటి విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని రైతులు తెలిపారు. రోజు మాదిరిగానే ఉదయం రైతులు వెళ్లి చూడగా, ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేశారన్నారు. ఈ విషయంలో ఏఈ శ్రీనివాస్‌గౌడ్‌కు సమాచారం అందించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై రాజశేఖర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

22న సీసీఐ కొనుగోళ్ల నిలిపివేత

మద్నూర్, జనవరి 20: అయోధ్య రామ మందిరంలో రామ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వ సంస్థలకు సెలవు ప్రకటించడంతో మద్నూర్ మండల కేంద్రంలో పత్తి కొనుగోలు చేస్తున్న సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని మూసి వేస్తున్నట్లు అధికారి తెలిపారు. అదే విధంగా తిరిగి ఈ నెల 23న పునః ప్రారంభం అవుతుందని వెల్లడించారు. విక్ వెరైటీ పత్తిని రూ.6,920 తగ్గించినట్లు వెల్లడించారు. రైతులు సోమవారం పత్తి తీసుకుని రావద్దని సూచించారు.



డోంగ్లీలో వత్తిని తయారు చేస్తున్న మహిళలు

ఐదు రోజులు వెలిగేలా వత్తి తయారీ

మద్నూర్, జనవరి 20: డోంగ్లీ మండల కేంద్రంలోని రామాలయంలో రామ ప్రతిష్ఠ కార్యక్రమం పురస్కరించుకుని 6 అడుగుల వత్తిని పత్తితో తయారు చేశారు. ఈ వత్తిని రామ ప్రతిష్ఠ రోజు స్థానిక రామాలయంలో వెలిగిస్తామని, అక్కడి నుంచి 5 రోజుల పాటు దీపం వెలుగుతుందన్నారు. అయోధ్యలో రామ ప్రతిష్ఠ సందర్భంగా వత్తిని తయారు చేసిన మహిళలకు సర్పంచ్ మాధవీ అభినందించారు.



దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ

తాళం వేసిన ఇంట్లో చోరీ

కామారెడ్డి టౌన్, జనవరి 20: కామారెడ్డి పట్టణంలోని ఆర్యనగర్ కాలనీలో గుర్తు తెలియని వ్యక్తులు తన్నీరు శేఖర్ అనే వ్యక్తి ఇంట్లో శుక్రవారం రాత్రి చోరీకి పాల్పడినట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 18న ఇంటికి తాళం వేసి శేఖర్ కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతి దైవదర్శనానికి వెళ్లాడు. ఇంటికి తాళం ఉండడంతో ఇంట్లోకి చొరబడి రూ.3లక్షల 50వేల నగదు, మూడున్నర తులాల బంగారు ఆభరణాలు, రెండు కిలోల వెండి వస్తువులను, రెండు లాప్‌టాప్‌లను దొంగిలించుకు పోయారని సీఐ తెలిపారు. శేఖర్ కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

కామారెడ్డి బస్టాండ్‌లో శవం లభ్యం

కామారెడ్డి టౌన్, జనవరి 20: కామారెడ్డి బస్టాండ్‌లో ఒక గుర్తు తెలియని మగ వ్యక్తి సుమారు 40 నుంచి 50 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి శవం లభ్యమైనట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. బస్టాండ్ ప్రాంగణంలో ఫుట్‌పాత్‌పై చనిపోయి ఉన్నాడని తెలిపారు. ఎవరైన గుర్తుపడితే కామారెడ్డి పట్టణ పోలీసుస్టేషన్ నందు సంప్రదించాలని తెలిపారు.



మద్నూర్‌లో ఓటర్ల నమోదును పరిశీలిస్తున్న తహసీల్దార్



సదాశివనగర్‌లో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న ఆర్డీవో ప్రభాకర్

ఓటు హక్కు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలి

నిజాంసాగర్, జనవరి 20: ఓటు హక్కు నమోదుకు దరఖాస్తులు చేసుకోవాలని, 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెలలో రెండు రోజుల పాటు అవకాశం కల్పించారని, కొత్త ఓటు హక్కు నమోదుతో పాటు ఓటరు నమోదు కార్డులో సవరణలుంటే సరి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల రైతు బంధు కన్వీనర్ మహేందర్ కుమార్, ఆర్ఐ అంజయ్య, పంచాయతీ కార్యదర్శి గంగారాం, నాయకులు, తదితరులున్నారు.

మద్నూర్: జనవరి 1, 2024 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటు హక్కు కోసం ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఆయా బూత్‌లలో ఓటర్ల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. శేఖాపూర్, మద్నూర్, మేనూర్‌లలో తహసీల్దార్ ముజీబ్ పరిశీలించారు. ఆయనతో పాటు ఆర్ఐ శంకర్, సీనియర్ అసిస్టెంట్ విజయ్ తదితరులున్నారు.

ఓటరు లిస్టులో తప్పులు లేకుండా చూడాలి

సదాశివనగర్: మండలంలోని అన్ని గ్రామాల్లో ఓటరు లిస్టుల్లో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలని ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ తెలిపారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన ఓటరు జాబితా స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకునే విధంగా అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు కల్పించి 100 శాతం ఓటరు నమోదు జరిగేలా చూడాలని తహసీల్దార్ హిమబిందుకు సూచించారు.

దోమకొండలో యువకుడి ఆత్మహత్య కలకలం

- తన భూమిని సర్పంచ్, మరో ముగ్గురు కబ్జాచేశారంటూ ఆరోపణ
- విచారణ చేపట్టిన పోలీసులు

దోమకొండ, జనవరి 20: మండలంలోని అంబార్‌పేట గ్రామంలో పుట్ట బాల్‌చంద్రం (40) అనే యువకుడు శుక్రవారం అర్ధరాత్రి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం రేపింది. తన ఆత్మహత్యకు సర్పంచ్, మరో ఇద్దరు వ్యక్తులు కారణమని.. వీరుతన భూమిని కబ్జాచేయడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడుతున్నానని పేర్కొన్నాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేటలో గ్రామానికి చెందిన బాలచంద్రం స్థానికంగా టిఫిన్ సెంటర్ నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇతడికి భార్య సుగుణ, కూతురు ఇందు, కుమారుడు శ్రీకర్ ఉన్నారు. బాలచంద్రం బీఆర్ఎస్‌లో ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడు. బాలచంద్రంకు గ్రామపంచాయతీ ఎదురుగా 250 గజాల అసైన్‌మెంట్ స్థలం ఉండేది. అయితే ఈ స్థలంపై సర్పంచ్ సలీం కన్నుపడింది. గ్రామ అభివృద్ధి పనుల కోసమని బాలచంద్రం ఈస్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించాడు. దీంతో బాలచంద్రం కొన్ని నెలల క్రితం తన స్థలం చుట్టూ కంచె ఏర్పాటు చేశాడు. సర్పంచ్‌తో పాటు అప్పట్లో దోమకొండ ఎస్సైగా పనిచేసిన సుధాకర్ ఈ కంచె



గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ

తీయించేశారు. ఇదే విషయాన్ని అప్పటి ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోలేదు. దీంతో మనస్థాపానికి గురైన బాలచంద్రం.. తన సూసైడ్‌నోట్‌ను వాట్సాప్‌లో టైప్ చేసి గ్రామ వాట్సాప్ గ్రూప్‌లలో పోస్టు చేసి శుక్రవారం అర్ధరాత్రి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన చావుకు పూర్తి బాధ్యుడు సర్పంచ్ సలీంతో పాటు మరో ఇద్దరు వ్యక్తులు పుట్ట శ్రీనివాస్, పుట్టబాలనర్సులు ఉన్నారని సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. వీరంతా కబ్జా చేసేందుకు మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్ సహకరించాడని తెలిపాడు. అదేవిధంగా గ్రామంలోని మరోచోట ఉన్న భూముల విషయంలోనూ తమ రక్త సంబంధీకుల మధ్య విభేదాలు సృష్టించి.. తనకు రావాల్సిన భూమిని రాకుండా అడ్డుకుంటున్నారని వాపోయాడు. తన చావు కారణమైన వారిని శిక్షించాలని సీఎం రేవంత్‌రెడ్డికి, స్థానిక ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డిని కోరాడు. సమాచారం అందుకున్న కామారెడ్డి డీఎస్పీ ప్రకాష్, భిక్కనూర్ సీఐ తిరుపతయ్య, కామారెడ్డి సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, దోమకొండ ఎస్సై వెంటనే ఘటనా స్థలికి చేరుకున్నారు. స్థానికంగా ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గ్రామంలోనూ పికెటింగ్ నిర్వహించారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య బాలచంద్రం అంత్యక్రియలను కుటుంబసభ్యులతో నిర్వహించారు. మరో వైపు.. సర్పంచ్ సలీం అతని తమ్ముడు సద్దాంతోపాటు పుట్ట బాల నర్సు, పుట్ట శ్రీనివాస్, పుట్ట రమేష్ కలిసి తమ ప్లాట్‌ను, భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నించడంతోనే తమ కుమారుడు బాలచంద్రం ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తండ్రి పుట్టవెంకయ్య పోలీసులకు ఫిర్యాదుచేశాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మురళి తెలిపారు.

తపాలా శాఖ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా తపాలాశాఖ సూపరింటెండెంట్ జనార్దన్ రెడ్డి

మద్నూర్, జనవరి 20: తపాల శాఖ ఆధ్వర్యంలో పేద ప్రజల ప్రయోజనాల కోసం భారత ప్రభుత్వం పలు పథకాలను ప్రవేశ పెడుతుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా తపాలాశాఖ సూపరిండెంట్ జనార్ధన్ రెడ్డి అన్నారు. మద్నూర్, జుక్కల్, బిచ్కుంద శాఖలకు సంబంధించిన తపాలా సిబ్బందికి ఆయన అవగాహన కల్పించడంతో పాటు ప్రజలకు తపాలా శాఖ అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఆడ పిల్లల కోసం సుకన్య సంమృద్ధి యోజన, సీనియర్ సిటిజన్ల కోసం ప్రత్యేక కార్యక్రమం, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి సురక్ష పథకం తదితర పథకాలను అమలు చేస్తుందని, ఏడాదికి రూ. 520లతో 10 లక్షల ఇన్సూరెన్స్ కల్పిస్తున్నట్లు గుర్తు చేశారు. ఈ పథకం కింద మద్నూర్ మండలం లచ్చన్‌కు చెందిన దేవిదాస్ ప్రమాదంలో చికిత్స పొందగా, ఆయనకు తపాలా శాఖ నుంచిరూ. 62 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బోధన్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వేణు, కామారెడ్డి బ్రాంచ్ మేనేజర్ పవన్ రెడ్డి, గంగాధర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ ప్రసాద్

సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

కామారెడ్డి టౌన్, జనవరి 20: కామారెడ్డి పట్టణంలోని దేవునిపల్లి పరిధిలో వీఆర్‌కే డిగ్రికళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్‌సెల్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ సైబర్‌నేరాల పట్ల విద్యార్థులకు వివరించారు.సైబర్ నేరగాళ్లు చేసే మోసపూరిత ఫోన్‌కాల్స్‌సందేహాలను నమ్మవద్దని,లోన్ అప్లికేషన్ ఎవరు కూడా డౌన్‌లోడ్ చేసుకోవద్దని, గుర్తుతెలియని వ్యక్తులు ఎవరుకూడా డబ్బులు గాని, బహుమతులు గాని, ఉద్యోగాలు ఇవ్వరు అని విషయాన్ని గమనించాలని తెలిపారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

లింగంపేట, జనవరి 20: వాహనాలపై ప్రయాణిస్తున్న సమయంలో రోడ్డు భద్రత నియమాలు పాటించాలని కామారెడ్డి ఆర్‌టీఏ విక్రమ్ విద్యార్థులకు సూచించారు. శనివారం లింగంపేట మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ రహదారి భద్రత మహోత్సవం సందర్భంగా రోడ్డు భద్రత నియమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమాలు పాటించకపోవడం వల్లే ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిపారు. ప్రతీ వాహనదారుడు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కలిగి ఉండాలని ప్రయాణ సమయంలో హెల్మెట్ ధరించకపోవడం, సీటుబెల్ట్ పెట్టుకోకపోవడంతో బలమైన గాయాలపాలై మృతిచెంది కుటుంబీకులకు తీరని సోకాన్ని మిగిల్చుతున్నారని అన్నారు. అనంతరం ఏఎస్ఐ ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులు మత్తుపదార్థాలకు బానిసలు కావద్దన్నారు. కార్యక్రమంలో స్వామిగౌడ్, అమిర్,పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయుడు వహిద్



మాట్లాడుతున్న కామారెడ్డి ఆర్‌టీఏ

సిద్దికితోపాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీర్కూర్: మండల కేంద్రంలో శనివారం రోడ్డు భద్రత వారోత్సవాలను నిర్వహించారు. మద్నూర్ ఆర్‌టీవో రామచంద్రనాయక్ మాట్లాడుతూ జనవరి 14వ తేది నుంచి ఫిబ్రవరి 15 వరకు రోడ్డుభద్రత వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోడ్డు సేఫ్టీ గురించి ప్రతీఒక్కరు అవగాహన



బీర్కూర్‌లో మాట్లాడుతున్న ఆర్‌టీవో

కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలను నడపకూడదని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించి వాహనాలను నడపాలన్నారు. దేశంలో ప్రతీ నిమిషానికి ఒక రోడ్డు ప్రమాదం జరుగుతుండగా, ప్రతీ మూడు నిమిషాలకు అదే రోడ్డు ప్రమాదంలో ఒకరు మృత్యువాత పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై నర్సింలు పాల్గొన్నారు.

పాఠశాల పక్కన ఉన్న వైన్స్‌ను తొలగించాలి

కామారెడ్డి టౌన్, జనవరి 20: జిల్లా కేంద్రంలోని గౌతమ్ మోడల్ స్కూల్ దగ్గర నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన ఎస్ఆర్-2 వైన్స్‌ను తొలగించాలని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు వినోద్ నాయక్ వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి మున్సిపల్ కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేసిన వైన్స్‌కు పది అడుగుల దూరంలోనే పాఠశాల ఉందని ఈ వైన్స్‌ను తొలగించాలని ఎక్సైజ్ అధికారులకు కోరినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తుంటే అధికారులు ఏ విధంగా అనుమతులు మంజూరు చేశారని ప్రశ్నించారు. వైన్స్‌ను వెంటనే అక్కడి నుంచి తరలించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేష్, నగేష్, చందు, ఫూల్‌సింగ్, దేవీసింగ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



ఎక్సైజ్ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందిస్తున్న విద్యార్థి సంఘ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం సుధాకర్

డ్వాక్రా సంఘాలు ఏ గ్రేడ్‌లో ఉండేలా చూడాలి

నాగిరెడ్డిపేట, జనవరి 20: మండలంలోని అన్ని డ్వాక్రా సంఘాలు ఏ గ్రేడ్‌లో ఉండేలా కృషిచేయాలని జిల్లా ఐకేపీ డీపీఎం సుధాకర్ తెలిపా రు. శనివారం ఐకేపీ కార్యాలయంలో మండల సమాఖ్య సమావేశంతో పాటు వీవోఏల సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశా నికి హాజరైన సుధాకర్ మాట్లాడుతూ మండలంలోని ప్రతి సంఘం నిర్ణీత తేది ప్రకారం సమావేశం ఏర్పాటు చేసుకుని సమావేశంలోనే అన్నిరకాల లావాదేవీలు జరిపి దాన్ని ఆన్‌లైన్‌లో పొందుపర్చడం ద్వారా గ్రూప్‌ను ఏగ్రేడ్‌లోకి తేవాలని ఆయన వీవోఏలకు సూచించారు. ప్రతీ సంఘం మహిళలు వివిధవ్యాపార మార్గాల ద్వారా స్వయం ఉపాధితో రాణించాలని కోరారు. పెరటి కోళ్లపెం పకం, గేదెల పెం పకం, సోలార్ ప్లాంట్ల ఏర్పాటు తదితర అంశాల గురించి ఆయన వీవో ఏలకు అవగాహన కల్పించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే వీవో ఏలపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వీవోఏలు గ్రా మ సంఘాల్లో మహిళలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ పథకాలపై సంఘాల నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ ఇస్తూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు శాంత, ఏపీఎం జగదీష్ కుమార్, డీఎంజీ సంగమేశ్వర్, సీసీలు దత్తు, నారాయణ, రమేష్, రఫీద్, సాయిలు, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

'ప్రయోగత్మక కార్యక్రమాల్లో భాగస్వాములవ్వాలి'

దోమకొండ, జనవరి20: విద్యా విధానాలలో వస్తున్న మార్పులను అనుసరించి విద్యార్థులు కేవలం పుస్తక పరిజ్ఞానానికే పరిమితం కాకుండా ప్రయోగత్మకంగా కార్యక్రమాల నిర్వహణలో భాగస్వాములవ్వాలని గడి కోట ట్రస్ట్ మేనేజర్ బాబ్జి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కోటలో సమగ్ర గ్రామీణ అభివృద్ధి సౌత్ క్యాంపస్, ట్రస్ట్ పరస్పర సహకార సమన్వయ సమావేశం నిర్వహించారు. దోమకొండ ట్రస్ట్ వ్యవస్థపకులు కామినేని అనిల్ కుమార్ ఇప్పటికే అనుక కార్యక్రమాలను ట్రస్ట్ ద్వారా చేపట్టడం జరిగిందన్నారు. ఈ ప్రయోగత్మక ఒప్పందం సౌత్ క్యాంపస్, ట్రస్ట్ మధ్య ఏర్పడటం వల్ల సమగ్ర గ్రామీణ అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసి అమలు చేయడం గ్రామానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ట్రస్ట్ మేనేజర్ అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కానుగంటి శారద, జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, సర్పంచ్ నల్లపు అంజలి, శ్రీనివాస్, ఉపసర్పంచ్ గజవాడ శ్రీకాంత్, తదితరులున్నారు.

ప్రజాపాలన నిర్వహణ నిధుల్లో ఎంపీడీవో చేతివాటం

లింగంపేట, జనవరి20: ప్రజాపాలన నిర్వహణ కోసం ప్రభుత్వం కేటాయించిన నిధుల్లో ఎంపీడీవో మల్లిఖార్జున్‌రెడ్డి చేతివాటం ప్రదర్శించి సుమారు రూ.లక్ష స్వాహా చేశాడని ఎంపీపీ గరిబున్నిసా నయీం తెలిపారు. శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ నిధుల కాజేతపై ఎంపీడీవోపై విచారణ జరిపి చర్యలుతీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గతనెల 28 నుంచి జనవరి 6వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రోగ్రాం నిర్వహణ కోసం ప్రభుత్వం ఒక్కో జీపీకి రూ.10వేలు మంజూరు చేసిందని, లింగంపేట మండలంలోని 41 జీపీలు ఉండగా, మొత్తం రూ.4లక్షల 10వేలను ప్రభుత్వం విడుదల చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం విడుదలచేసిన నిధులను సమానంగా పంపిణీ చేయాల్సిన ఎంపీడీవో చేతివాటం ప్రదర్శించి నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు ఎంపీపీ ఆరోపించారు. మండలంలోని సజ్జన్‌పల్లి, ఎల్లారం, మాలపాటి, ఎల్లమ్మతండా, అయ్యపల్లి, కొండాపూర్, బానాపూర్‌తండా, జగదాంబతండా, ఒంటర్‌పల్లి, కొయ్యగుండు తండా తదితర జీపీలకు రూ.7 నుంచి 8వేలు పంపిణీ చేశాడని, ముంబాజీపేట, కొండాపూర్ తదితర జీపీలకు రూ.9వేల చొప్పున ఇచ్చినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని సక్రమంగా అమలు చేయకుండా నిధులను కాజేసిన ఎంపీడీవోపై చర్యలు తీసుకోవాలని అన్నారు.

ముగిసిన ఏబీవీపీ యువజన వారోత్సవాలు

కామారెడ్డి టౌన్, జనవరి20: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన యువజన వారోత్సవాల క్రీడపోటీలు శనివారం ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘచాలక్ బొడ్డ శంకర్, జిల్లాప్రచారక్ హరి మాట్లాడుతూ స్వామివివేకానంద అడుగుజాడల్లో నడవాలని తెలిపారు. ఏబీవీపీ ప్రతి ఏటా యువజన వారోత్సవాలలో విద్యార్థుల చదువుతోపాటు ఆటలలో ముందుండి శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉండాలని క్రీడలను నిర్వహించడం సంతోషకరమని అన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు రణజిత్‌మోహన్, క్రీడాభారతీ మారుతి, సేవభారతీ జైపాల్, కృష్ణ, స్వామి, అనిల్, రోహిత్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పరుగు పోటీలకు విద్యార్థుల ఎంపిక

కామారెడ్డిటౌన్, జనవరి20: తెలంగాణ యూనివర్సిటీలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రాస్‌కంట్రీ 10కి.మిల పరుగుపందెంలో కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు హరిత మొదటిస్థానంలో నిలిచి బంగారు, అఖిత ద్వితీయ స్థానంలో నిలిచి వెండి పతకాన్ని సాధించారని పీడీ శ్రీనివాస్‌రావు ఎన్‌సీసీ అధికారి రామస్వామి తెలిపారు. వీరు మహారాష్ట్రలో ఫిబ్రవరి 11న జరిగే జాతీయస్థాయి 10కి.మీల పరుగు పందెం పోటీలకు హాజరుకానున్నారని తెలిపారు. ఇద్దరు విద్యార్థులను ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శంకర్, రాజుకుమార్, చంద్రకాంత్, రామకృష్ణ, గణేష్, వెంకటేశ్వర్లు, శివ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పోచారం

తనయులకు రాజకీయ భవిష్యత్తు లేదు

- మాజీ జడ్పీటీసీ ద్రోనవల్లి సతీష్ వ్యాఖ్య
- వాట్సాప్ గ్రూపుల్లో సంభాషణ రికార్డ్ వైరల్

బీర్కూర్, జనవరి20: బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డితోనే రాజకీయం ఆఖరని, ఆయన తనయులకు రాజకీయ భవిష్య త్తు లేదని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రధాన అనుచరుడు, మాజీ జడ్పీటీసీ ద్రోనవల్లి సతీష్ వ్యాఖ్యానించడం పార్టీలో తీవ్ర దుమారం రేపుతోంది. అయితే పోచారం అనుచరుడు మాట్లాడిన సంభాషణ మొత్తం ఫోన్‌లో రికార్డు అయింది. ప్రస్తుతం ఈ సంభాషణకు సంబంధించిన రికార్డింగ్ వాట్సాప్ గ్రూపుల్లో జోరుగా చక్కర్లు కొడుతోంది. అయితే ఆయన మాట్లాడిన మాటలు ఆయన ఫోన్ నుంచే వాట్సాప్ గ్రూపుల్లో రావడం ఒకింత అందరినీ ఆశ్చర్య పరిచింది. ఫోన్ రికార్డింగ్ గ్రూపుల్లో రాగానే గ్రూపు సభ్యులు మొదట ఆసక్తిగా విన్నారు. పోచారం తనయులపై మాట్లాడిన మాటలు విని షాక్‌కు గురయ్యారు. ఇదిలా ఉండగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఫోన్ రికార్డింగ్‌ను ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డికి, డీసీసీబీ ఛైర్మన్ భాస్కర్‌రెడ్డి, సురేందర్ రెడ్డిలకు చేరవేశారు. బీర్కూర్ నాయకుడి వ్యాఖ్యలపై పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆయన తనయుల సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి

దర్శన్ - హనుమాన్
శాంతి - గుంటూరు కారం
ప్రియా 70 - నా సామి రంగ
ప్రియా 35 - సైందవ్

బాన్సువాడ

మహేశ్వరి - గుంటూరు కారం
వెంకటేశ్వర - హనుమాన్



చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	100	160	180
వెన్‌కాబ్(కిలో)	100	180	210

